# కులవృత్తులకు చేయూత

- పేద కుటుంబాల్లో వెలుగులు నింపేందుకే ఆర్థిక సాయం
- నియోజకవర్గంలో రెండో విడతలో 200 మందికి పంపిణీ


మణుగూరులో రూ.లక్ష ఆర్థిక సాయం అందుకుంటున్న లబ్ధిదారురాలు (ఫైల్)

సారపాక, అక్టోబర్ 12: తెలంగాణ ప్రభుత్వం బీసీ కులవృత్తులకు రూ.లక్ష ఆర్థికసాయం ప్రకటించింది. కులవృత్తులు, చేతివృత్తుల పనులు చేసుకునే బీసీ కుటుంబాలకు చేయూతనందించి వారిని ఆర్థికంగా బలోపేతం చేసేందుకు ఈ పథకాన్ని ప్రారంభించింది. ఈ పథకానికి తొలి విడతలో ముఖ్యమంత్రి కేసీఆర్ రూ.400 కోట్లు విడుదల చేశారు. అన్ని వర్గాల అభ్యున్నతే లక్ష్యంగా ముందుకెళుతున్న ప్రభుత్వం రాష్ట్రంలో కులవృత్తులు, చేతివృత్తుల వారికి చేయూత అందించేందుకు ఆర్థికసాయం ప్రకటించి రూ.లక్ష ఆర్థికసాయం అందిస్తోంది. విశ్వబ్రాహ్మణులు, నాయీబ్రాహ్మణులు, రజకులు, కుమ్మరి, మేదర తదితర కులాలను ఎంపిక చేసుకుని వారు పనిముట్లు, ముడిసరుకులు కొనుగోలు చేసేందుకు పూర్తి సబ్సిడీతో ఈ సాయం అందిస్తోంది. పినపాక నియోజకవర్గంలో రెండో విడతలో 200 మందికి పైగా ఇప్పటికే ఆర్థికసాయం అందించగా ఈ పథకం నిరంతర ప్రక్రియగా కొనసాగనున్నది. విడతల వారీగా అర్హులను గుర్తించి క్షేత్రస్థాయిలో వారి సమాచారాన్ని సేకరించి ఈ పథకాన్ని విస్తరించే దిశగా అధికారులు చర్యలు చేపడుతున్నారు.

### బీసీలకు చేయూత కోసమే రూ.లక్ష ఆర్థికసాయం..



తెలంగాణ ప్రభుత్వం బీసీ కులవృత్తులను ఆదుకునేందుకు రూ.లక్ష ఆర్థిక సాయం అందిస్తుండడం గొప్ప విషయం. నాకు ప్రభుత్వం ద్వారా రూ.లక్ష ఆర్థికసాయం అందింది. దీంతో అవసరమైన పనిముట్లు కొనుగోలు చేసుకుని లాండ్రీ షాపు పెట్టుకుని ఇస్త్రీ చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాను. గతంలో ఏ ప్రభుత్వాలూ కులవృత్తిదారులను పట్టించుకోలేదు. ప్రస్తుతం తెలంగాణ ప్రభుత్వం కులవృత్తిదారులను గుర్తించి రూ.లక్ష ఆర్థికసాయం చేయడంతో మాలాంటి కుటుంబాలకు ఆర్థిక భరోసా లభిస్తోంది.

**–శాఖపురి ప్రశాంత్, రజకుడు, మోరంపల్లిబంజర్, బూర్గంపహాడ్ మండలం**

### నా కుమారుడికి వెల్డింగ్ షాపు పెట్టించా..



బీసీ చేయూత కింద తెలంగాణ ప్రభుత్వం నాకు రూ.లక్ష సాయం అందించింది. నేను సెలూన్ పెట్టుకుని జీవనం సాగిస్తున్నా. నా కుమారుడికి రూ.లక్షతో వెల్డింగ్ పనిముట్లు కొనుగోలు చేసి కుమారుడితో షాపు పెట్టించా. నాకు కులవృత్తి తోడు ఉండగా.. నా కుమారుడు ప్రభుత్వం ఇచ్చిన రూ.లక్షతో వెల్డింగ్ పాపునకు యజమానిగా మారాడు. కులవృత్తులకు సీఎం కేసీఆర్ ఇలాంటి ఆర్థికసాయం చేయడంతో నిరుపేద కుటుంబాల్లో వెలుగులు నిండుతున్నాయి.

**–సమ్మెట శ్రీనివాస్, నాయీబ్రాహ్మణ లబ్ధిదారుడు, శివలింగాపురం, మణుగూరు**

### రూ.లక్షతో ఆటోను కొనుగోలు చేశా..



తెలంగాణ ముఖ్యమంత్రి కేసీఆర్ కులవృత్తులకు బీసీ చేయూతగా రూ.లక్ష సాయం అందించి మాలాంటి నిరుపేదలకు ఆర్థిక భరోసా కల్పిస్తున్నారు. రెండో విడతలో నాకు రూ.లక్ష ఆర్థికసాయం అందించారు. వచ్చిన సొమ్ముతోపాటు కొంత ఫైనాన్స్ తీసుకొని ఆటోను కొనుగోలు చేశా. దానిని నడుపుకుంటూ జీవనోపాధి పొందుతున్నా. కుటుంబాన్ని మంచిగా పోషించుకుంటున్నా. మా కుటుంబమంతా సీఎం కేసీఆర్‌కు రుణపడి ఉంటుంది.

**–గుడ్ల రంజిత్‌కుమార్, పూసల లబ్ధిదారుడు, కరకగూడెం**

## పరిసరాల పరిశుభ్రతతోనే వ్యాధులు దూరం


శిబిరంలో గ్రామస్తులను పరీక్షిస్తున్న వైద్య సిబ్బంది

గుండాల, అక్టోబర్ 12: పరిసరాల పరిశుభ్రతతోనే వ్యాధులు దరి చేరవని, జ్వర లక్షణాలు ఉన్న వారు నిర్లక్షం చేయకుండా ప్రభుత్వ ఆసుపత్రికి వచ్చి రక్తపరీక్షలు చేయించుకోవాలని డాక్టర్ మనీశ్ రెడ్డి సూచించారు. ఏజెన్సీ గ్రామమైన దామరతోగు గ్రామంలో గురువారం వైద్య శిబిరంలో రోగులను పరీక్షించి మందులు పంపిణీ చేసి మాట్లాడారు. గ్రామంలో మలేరియా నిర్ధారణ కోసం జ్వర లక్షణాలు ఉన్న ఆరుగురి రక్త నమూనాలు సేకరించారు. కార్యక్రమంలో సర్పంచ్ సుతారి సరోజ, కార్యదర్శి రామ్‌మోహన్, ఎంటీఎస్ సత్యం, ఏఎన్ఎమ్‌లు అరుణ,కమల, ఆశ కార్యకర్తలు సుమలత, రాంబాయి తదితరులు పాల్గొన్నారు.

## కొత్తురులో ఆయుర్వేద వైద్య శిబిరం


గ్రామస్తులకు వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న సిబ్బంది

అశ్వాపురం,అక్టోబరు 12 : ఆదివాసీ గ్రామమైన కుమ్మరి గూడెం కొత్తురులో గురువారం నిర్వహించిన ఆయుర్వేద వైద్య శిబిరంలోప్రభుత్వ ఆయుర్వేద వైద్యాధికారి డాక్టర్ అరుణ రోగులను పరీక్షించి మందులు అందజేశారు. ఆమె మాట్లాడుతూ.. ఆయుర్వేద ఔషధాల విశిష్టత, వాతావరణ మార్పుల ద్వారా శారీరకంగా వచ్చే వ్యాధులు, గృహ చిట్కాలను వివరించారు. కార్యక్రమంలో వైద్యులు ఉమాదేవి, రాధిక, ప్రజలు పాల్గొన్నారు.

కరకగూడెం,అక్టోబర్ 12 : మొండి వ్యాధులు ఆయుర్వేద వైద్యంతోనే పూర్తిగా నయమవుతాయని, ఆయుర్వేద వైద్య శిబిరాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని డాక్టర్ కుమారస్వామి అన్నారు. అనంతారం పంచాయతీ పరిధి కొత్తూరు గ్రామంలో గురువారం ఉచిత ఆయుర్వేద వైద్య శిబిరాన్ని ప్రారంభించి మాట్లాడారు. గ్రామస్తులకు వైద్య పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.


మందులు పంపిణీ చేస్తున్న సిబ్బంది

## సమన్వయంతో విధులు నిర్వర్తించాలి

**ఎన్నికల సన్నాహక సమావేశంలో ఐటీడీఏ పీవో ప్రతీక్ జైన్**

మణుగూరు టౌన్, అక్టోబర్ 12: అధికారులంతా సమన్వయంతో ఎన్నికల విధులు నిర్వర్తించాలని పినపాక నియోజకవర్గ ఎన్నికల రిటర్నింగ్ అధికారి, భద్రాచలం ఐటీడీఏ పీవో ప్రతీక్ జైన్ అన్నారు. ఎంపీడీవో కార్యాలయంలో గురువారం నిర్వహించిన సన్నాహక సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. ఎన్నికలకు సంబంధించిన ప్రకటనలు, ప్రచారాలపై మీడియా సర్టిఫికేషన్ అండ్ మానిటరింగ్ కమిటి నిఘా పెట్టాలని అన్నారు. నోడల్ అధికారి మణుగూరు డీఎస్పీ రాఘవేంద్రరావు మాట్లాడుతూ నియోజక వర్గంలోని మండలాల్లో రాజకీయ పార్టీల బ్యానర్లు, ఫ్లెక్సీలు, పోస్టర్లు ఉంటే తొలగించాలని కోరారు. ఇతర ప్రాంతాల నుంచి రాకపోకలు సాగించేవారి వద్ద రూ.50 వేలకు మించి నగదు ఉంటే తగిన ఆధారాలు చూపించాల్సి ఉంటుందన్నారు. సమావేశంలో తహసీల్దార్లు, ఎంపీడీవోలు, ఎంపీవోలు, పోలీస్ శాఖా అధికారులు తదితరులు పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న పీవో ప్రతీక్ జైన్

# పాఠశాలల్లో బతుకమ్మ సంబురాలు



పినపాక : ఎక్సలెంట్ స్కూల్‌లో బతుకమ్మ ఆడుతున్న విద్యార్థులు,సిబ్బంది, రాధిక హై స్కూల్‌లో బతుకమ్మ ఆడుతున్న విద్యార్థులు, ఉపాధ్యాయులు

ఆళ్లపల్లి, అక్టోబర్ 12 : పాతూరు పంచాయతీలోని ప్రభుత్వ పాఠశాలలో ఉపాధ్యాయులు, విద్యార్థులు కలిసి గురువారం బతుకమ్మ ఆడారు. హెచ్.యం.చిరంజీవి, ఉపాధ్యాయులు బాలాజీ, వీరన్న, హతిరామ్, రాజులు, రమణ, విద్యార్థినులు పాల్గొన్నారు.

గుండాల, అక్టోబర్ 12: గుండాలలోని జిల్లా పరిషత్ పాఠశాలలో బతుకమ్మ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఉపాధ్యాయులు విద్యార్థులు కలిసి పాఠశాలలో బతుకమ్మలు ఆడారు. ప్రదానోపాధ్యాయురాలు తిరుపతమ్మ, బాలరాజు, భుజంగారావు, వెంకటేశ్వర్లు, నారాయణమ్మ, శంకర్, రాజ్యలక్ష్మి పాల్గొన్నారు.

పినపాక , అక్టోబర్ 12 : మండలంలోని ప్రైవేటు పాఠశాలల్లో గురువారం ముందస్తు బతుకమ్మ వేడుకలను ఘనంగా నిర్వహించారు. తీరొక్క పూలతో బతుకమ్మలను పేర్చి సాంప్రదాయ దుస్తులు ధరించి ఆడిపాడారు. కార్యక్రమంలో ఎండీ యూసుఫ్ షరీఫ్, ఖాదర్, యాకూబ్ షరీఫ్, ముక్కు నర్సారెడ్డి, బండారు నరేంద్ర, అంకం సురేశ్, మధుసూధన్ రెడ్డి, జయసింహారెడ్డి, సంపత్ రెడ్డి, నిరోష, రామకృష్ణ పాల్గొన్నారు.



ఆళ్లపల్లి : పాతురు పాఠశాలలో బతుకమ్మ వేడుకలు, గుండాల : బతుకమ్మ ఆడుతున్న మహిళలు